సాక్షి శ్రీకాకుళం

బుధవారం | 8 | అక్టోబర్ | 2025



పిల్లలకు ప్రత్యక్ష నరకం

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయట భోజనాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

- 8లో



ఆరోగ్యకరమంట..!

గిరిజనులు పోడు వ్యవసాయంలో భాగంగా సేంద్రియ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కొనుగోళ్లు సైతం ఆశాజనకంగా ఉంటున్నాయి.

- 8లో

జెడ్పీ సీఈఓగా సత్యనారాయణ

అరసవల్లి: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా (సీఈవో) డి.సత్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇప్పటివరకు జెడ్పీలో డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వర్తించారు. ఇంతవరకు సీఈవోగా పనిచేసిన శ్రీధర్‌రాజా.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఓఎస్డీగా విధుల్లో చేరారు.

న్యూస్‌రీల్

ఆ నేత్రాలు సజీవం



నేత్రదాత రమేష్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రామకృష్ణ థియేటర్ సమీపంలో నివాసముంటున్న పేర్ల రమేష్ (63) అనారోగ్య కారణంతో మృతి చెందారు. మరణాంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో నేత్రాలను దానం చేసేందుకు కుమారుడు పేర్ల విజయకృష్ణ, కుమార్తెలు స్వాతి, ఖ్యాతిలు ముందుకు వచ్చారు. విషయం రెడ్‌క్రాస్‌కు తెలియజేయగా.. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జిలు సుజాత, సుమతిలు ఆయన కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యుడు దుర్గా శ్రీనివాస్ మంగళవారం అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

రాత్రిపూట యూరియా తరలింపు



గార డీసీఎంఎస్ కేంద్రం వద్ద ఆటోలో యూరియా బస్తాలు

గార: మండల కేంద్రంలోని గార డీసీఎంఎస్ కేంద్రం నుంచి మంగళవారం చీకటి పడిన తర్వాత ఆటోలో పెద్ద ఎత్తున యూరియా తరలించడం కలకలం రేపింది. సుమారు 30 బస్తాలు వరకు లోడింగ్ జరిగిందని తెలుస్తోంది. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒకటి, రెండు యూరియా బస్తాలు మాత్రమే దొరుకుతున్న సమయంలో ఒకేసారి బస్తాలు తరలించడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై శ్రీకాకుళం ఏడీఏ బగ్గు రజిని వద్ద ప్రస్తావించగా టోకె న్లు ద్వారానే యూరియా పంపిణీ చేశామని, రైతులంతా కలిపి ఆటో ద్వారా తరలించి ఉంటారని, అయినప్పటికీ విచారణ చేపడతామని పేర్కొన్నారు.

టిఫిన్‌లో ఉప్మా వద్దు




భోజనాలు పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

రణస్థలం : కేజీబీవీలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. లావేరు మండలం మురపాక కేజీబీవీని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఫిన్‌లో భాగంగా వడ్డిస్తున్న ఉప్మా బాగోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారని, ఇకపై ఉప్మా స్థానంలో టమాటా రైస్ పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బోధనపై ఆరా తీశారు. డీఈవో రవిబాబు, ఏపీసీ ఎస్.శశిభూషణ్‌రావు, ఎస్‌వో బి.సుధ పాల్గొన్నారు.

కొత్తూరు కేజీబీవీ ప్రిన్సిపాల్, అకౌంటెంట్లపై వేటు

శ్రీకాకుళం : కొత్తూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాధిక, అకౌంటెంట్ శ్రీదేవిలను విధుల నుంచి తొలగిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు వెలువడినా గోప్యంగా ఉంచారు. దసరా సెలవులు ముందు రోజున కేజీబీవీ నుంచి బియ్యాన్ని విక్రయానికి తరలిస్తున్నట్లు కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణకు సమాచారం అందింది. వెంటనే ఆయన తనిఖీకి వెళ్లగా వాస్తవమేనని తేలింది. బియ్యాన్ని సీజ్ చేసి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై విచారణ జరిపించిన జిల్లా అధికారులు ప్రిన్సిపాల్, అకౌంటెంట్లను విధుల నుంచి తొలగించారు. ఈ విషయాన్ని ఏపీసీ శశిభూషణ్‌రావు ధ్రువీకరించారు.

సిక్కోలులో కిరాయిదాదాలు



- పచ్చని సిక్కోలులో విష సంస్కృతి
- పెరుగుతున్న సుపారీ గ్యాంగుల హవా
- ఒప్పందం ప్రకారం దాడులు, హత్యలు



శ్రీకాకుళం క్రైమ్:

ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే సిక్కోలులో విష సంస్కృతి మొదలయ్యింది. కిరాయి దాదాలు, సుపారీ గ్యాంగుల హవా రోజురోజుకూ పెరుగుతోంది. కొందరు తమ చేతికి మట్టి అంటకుండా ఉండేందుకు స్థానిక రౌడీషీటర్లతో పాటు కోలకతా, బీహార్, జార్ఖండ్ వంటి పక్క రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను తీసుకొచ్చి దాడులు, దౌర్జన్యాలు చేయిస్తూ పనులు చేయించుకుంటున్నారు. తమ మాట విననివారు అంతుచూడటానికి కూడా వెనుకాడటం లేదు. భూములు, షాపులు, అద్దె ఇళ్లను ఖాళీ చేయించడం తదితర బెదిరింపులు, ఆర్థిక వ్యవహారాలకు ఈ ముఠాలను ఉపయోగిస్తున్నారు. వీరికితోడు బొమ్మలు, బెలూన్లు, తోపేలాలు, జుట్టు అమ్ముకునే స్థానికుల్లా కొందరు బంగ్లాదేశ్ నుంచి సైతం మన జిల్లాకు వచ్చారని, వీరి నుంచి ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు.

జిల్లాలో ఇటీవల ఘటనల పరిశీలిస్తే..

- జిల్లా కేంద్రంలోని బ్యాంకర్స్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్న ఓ వ్యక్తికి అదే ఇంటి యజమానితో ఆర్థిక వ్యవహారాల్లో వివాదాలు వచ్చాయి. యజమాని చెప్పినా ఖాళీ చేయకపోగా ఆయన్ను బెదిరించే ఉద్దేశంతో మధ్యవర్తి సమక్షంలో సరుబుజ్జిలి మండలం మూల సవలాపురం గ్రామంలో ఉన్న లేడీ రౌడీషీటర్ బ్యాచ్‌తో కిరాయి మాట్లాడుకున్నారు. అక్కడి నుంచి నగరానికొచ్చి అర్ధరాత్రి ఇంట్లో చొరబడ్డారు. స్థానికులు తిరగబడటంతో వెనుదిరిగారు. అదే కిరాయిబ్యాచ్‌పై వారి గ్రామస్తులే సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జిల్లాలో నగరికటకం, కొత్తూరు, శ్రీకాకుళం, శ్రీకూర్మం, అల్లినగరం, జలుమూరు, రణస్థలం, పైడిభీమవరం తదితర ప్రాంతాలతో పాటు మరో రెండు జిల్లాల్లోనూ ఈ బ్యాచ్ దందాలు సాగిస్తోందని మీడియా ముందు ఏకరువు పెట్టారు.
- శ్రీకాకుళం జీటీ రోడ్డులోని అద్దె షాపులో వస్త్ర దుకాణం నడుపుతున్న వ్యక్తిని యజమాని ఖాళీ చేయించే ఉద్దేశంతో కొందరిని డబ్బులకు పురమాయించి దౌర్జన్యం చేసి పనికానిచ్చాడు.
- శ్రీకాకుళంలోని కిన్నెర కాంప్లెక్సు సమీపంలో ఓ వ్యాపారి ఇంట్లో కిలోల కొద్దీ బంగారం, భారీ మొత్తంలో నగదు కొట్టేందుకు నగరానికే చెందిన మరో వ్యాపారి పక్క జిల్లా, రాష్ట్రాల వ్యక్తులతో కిరాయికి మాట్లాడుకున్నాడు. ఇంట్లో మహిళలే తిరగబడి కత్తిపీటలతో ఎదురుతిరగడంతో పోలీసులకు దొరికిపోయారు.



- జిల్లాలో బంగారం వర్తక కేంద్రంగా ఉన్న నరసన్నపేటలో ఇటీవల ఓ బంగారం వ్యాపారిని అంతం చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. బంగారం తెచ్చేందుకు విశాఖ వెళ్లి తిరిగి వస్తుండగా తన డ్రైవరే మరో ఇద్దరితో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం పెద్దపాడులో తుదముట్టించి రామిగెడ్డలో పడేశాడు.
- జిల్లా కేంద్రం సమీప వివాదాస్పద స్థలాలు, కొత్తగా నిర్మితమవుతున్న భవనాలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద రౌడీషీటర్లు దందా సాగిస్తున్నారు. మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ స్థానిక నేతల అండదండలతో బ్లాక్ మెయిలింగ్‌కు దిగుతూ రెచ్చిపోతున్నారు.

నివురుగప్పిన నిప్పులా..?

- జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బయట రాష్ట్రాల వ్యక్తులు స్థానికుల్లా కలిసిపోతున్నారు. బంగ్లాదేశీయులు తాము బెంగాళీలమంటూ సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఉన్నారని తెలుస్తోంది. అత్యధికంగా సోంపేటలోనే ఉన్నారని, వీరంతా పశ్చిమబెంగాల్ నుంచి రైళ్లలో వచ్చి స్థానికంగా ఉండే అధికారులతో మాట్లాడి ఆధార్‌కార్డులు సైతం తయారు చేసుకున్నట్లు సమాచారం.
- కంచిలిలో జూలైలో ఓ రిటైర్డ్ లెక్చరర్ ఇంట్లో 25 తులాలు బంగారం కాజేసిన ఘటనలో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులే నిందితులు. వీరు స్థానికంగా బెలూన్లు అమ్ముకుంటూ రెక్కీ చేసి పనికానిచ్చారు.



నిఘా పెంచాం..

బయటి నుంచి వచ్చే సుపారీ గ్యాంగులు, ఇతర గ్యాంగుల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. వీరి విషయంలో నిఘా కొనసాగుతోంది. బయట రాష్ట్రాల అధికారులతో ఫింగర్‌ప్రింట్, ఇతర సాంకేతిక ఆధారాలు మ్యాచ్ అయ్యేలా డిజిటల్‌గా సిద్ధం చేశాం. చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా పెడుతున్నాం. రౌడీషీటర్లకు తరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– ప్రెస్‌మీట్‌లలో ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఘటనా స్థలంలో మృతదేహాలు

బడుగులపై పిడుగు

- గంగరాజపురంలో క్వారీలో పిడుగుపాటుకు ముగ్గురు దుర్మరణం
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- మృతులంతా ఉత్తరాది రాష్ట్రాల వారే

హిరమండలం/మెళియాపుట్టి:

పొట్టకూటి కోసం వందలాది కిలోమీటర్లు దాటి వలస వచ్చిన కార్మికులను పిడుగురూపంలో మృత్యువు బలిగొంది. మెళియాపుట్టి మండలం గంగరాజపురం గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ముగ్గురు క్వారీ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా టెక్కలి ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. పోలీసులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగరాజపురం సమీపంలో కొండపై రాజయోగి క్వారీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులు పనుల్లో ఉండగా మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు ప్రారంభమయ్యాయి. ఒక్కసారిగా పిడుగుపడడంతో కార్మికులు కుప్పకూలిపోయారు. ఈ ఘటనలో మేఘవాల్ హేమరాజ్(25), పింటు (25), శ్రావణ్‌కుమార్ (45) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కాళ్ల జనార్దనరావు, జాన్ బొలియర్ సింగ్, కరణం బాలరాజు, బైపోతు హరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే మెళియాపుట్టి తహసీల్దార్ బడే పాపారావు, సీఐ ఎన్.సన్యాసినాయుడు, మెళియాపుట్టి ఇన్‌చార్జిగా ఉన్న పాతపట్నం ఎస్‌ఐ కె.మధుసూదనరావు ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను టెక్కలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆస్పత్రికి వెళ్లి కార్మికులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

వలస కూలీలు..

గంగరాజపురం కొండపై కొద్దిరోజులుగా రాజయోగి పేరుతో క్వారీ నిర్వహిస్తున్నారు. దసరా పూజలు అనంతరం తిరిగి క్వారీ పనులు ప్రారంభించారు. ఇంతలోనే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులు మేఘవాల్ హేమరాజ్(రాజస్థాన్), పింటూ(మధ్యప్రదేశ్), శ్రావణ్‌కుమార్(బీహార్) వలస కూలీలు. గాయాలపాలైన జనార్దనరావుది టెక్కలిలోని ఆది ఆంధ్రావీధి, జాన్ బొలియర్ సింగ్‌ది ఒడిశాలోని టింఖియ సాయి గ్రామం. కరణం బాలరాజుది మెళియాపుట్టి మండలం బందపల్లి కాగా, బైపోతు హరిప్రసాద్‌ది పెదలక్ష్మీపురం. వీరంతా డ్రిల్లింగ్, క్వారీ కటింగ్‌లో ఉండగా ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది మేలో ఇదే మండలం దీనబంధుపురం క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. ఆ ఘటన మరువక ముందే పిడుగు రూపంలో బడుగులను మృత్యువు కబళించింది. తాజా ప్రమాదంతో క్వారీల్లో భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా, సమయపాలన పాటించకుండా పనులు చేపడుతున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జి ఎస్‌ఐ మధుసూదనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘటన పేలుడు వల్లే సంభవించి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోస్టుమార్టం రిపోర్టు వస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశముంది.



టెక్కలి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడుతున్న జేసీ, ఆర్డీవోలు

డెమో విభాగంపై.. విచారణకు సై..!

- వరుస కథనాలపై స్పందించిన ఉన్నతాధికారులు
- మరోవైపు విజిలెన్స్ అధికారుల ఆరా
- వైద్యశాఖ మంత్రి పేషీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకే అని ప్రచారం

అరసవల్లి:

జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కీలక విభాగమైన డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా విభాగం (డెమో)పై ఇటీవల వచ్చిన వరుస ఆరోపణలపై ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించారు. డెమో విభాగంలో ముఖ్య అధికారి అక్రమంగా నిర్వహించిన వ్యవహారాలపై 'సాక్షి'లో వరుస కథనాలను ప్రచురితమైన సంగతి విదితమే. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నివేదికలతో పాటే రాష్ట్ర వైద్యశాఖ మంత్రి పేషీకి కూడా పలు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీనిలో భాగంగా పేషీ ఆదేశాల మేరకు డెమో విభాగం నిర్వాకంతో పాటు అధికారుల పాత్రపై విచారణ జరిపేందుకు థర్డ్ పార్టీ ఎంక్వైరీ వేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసిందే. మరోవైపు, నేరుగా మంత్రి పేషీకి ఇక్కడ జరిగిన అక్రమాలను, కీలక అధికారి వ్యవహారాలను సైతం తెలిసేలా ఫిర్యాదులు పంపించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

- కొద్ది నెలల క్రితం ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీల పేరిట, కొత్త ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌తో పాటు పలు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ల రెన్యువల్ పనుల విషయంలో రూ.లక్షల్లో వసూళ్లు చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు పలు ఫిర్యాదులు కూడా వచ్చాయి. దీనికి తోడు లేని సౌకర్యాలను ఉన్నట్లుగా చూపించి పలు ల్యాబ్‌ల యాజమాన్యాలకు భారీగా బ్యాంకు రుణ సదుపాయాలకు సహకరించేలా ధ్రువీకరణ చేయడంతో రూ.లక్షల్లో కమీషన్లు వసూలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. పలు దినోత్సవాల నిర్వహణ, శాఖ ప్రగతి శకటాల ఏర్పాట్లలో కూడా కీలక అధికారితో కలిసి డెమో అధికారి వేలాది రూపాయలు తినేసారనే వార్తలు గుప్పుమన్నాయన్న సంగతి విదితమే. వీటిపై 'సాక్షి'లో వచ్చిన కథనాల ఆధారంగా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. మరోవైపు విజిలెన్స్ అధికారులు కూడా తమ దైన శైలిలో విచారణకు దిగారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా వైద్యారోగ్య శాఖలో అవినీతి, అక్రమాలకు అంతేలేకుండా పోతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తినేస్తున్నా డెమో..!

డెమో.. వామ్మో!

'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల గడువు అక్టోబర్ 25 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ బి.బేతనసామి మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జెండర్, కేటగిరీ, డిజేబులిటీ, పరీక్ష మాధ్యమం వివరాలను ఈ నెల 22 నుంచి 25 వరకు సవరణ చేసుకోవచ్చని ప్రకటించారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవ కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో వివిధ శాఖల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా వృథా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కాలువల శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో 16 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సంతబొమ్మాళిలో 400 హెక్టార్లు, పాతపట్నంలో 250 హెక్టార్లు, కొత్తూరు, హిరమండలంలో 100 హెక్టార్ల చొప్పున నష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. ధాన్యం మొలకెత్తడం, ధాన్యం పొట్టు దశలో నీరు చేరడం, పూత రాలిపోవడం వంటి నష్టం జరిగినట్లు తెలిపారు. దీనిపై తక్షణమే ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇంజినీరింగ్ పనుల్లో పూర్తయిన వాటికి బిల్లులు పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇంటింటికీ జీఎస్టీ ఫలాల ప్రచారంపై సమీక్షించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మృత్యుంజయేశ్వరుడికి కిరణ స్పర్శ



ముత్యాలపేటలో అమృత వర్షిణీ సమేత మృత్యుంజయేశ్వర స్వామికి మంగళవారం కిరణస్పర్శ కలిగింది. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు స్థానిక భక్తులు భారీగా తరలివచ్చారు. -కవిటి

దీపాల కాంతుల్లో నందీశ్వరుడు



ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేటలో నిర్వహిస్తున్న గౌరమ్మ–నందన్న ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన నందీశ్వరుడి వద్ద మంగళవారం బిందెల దీపాలు వెలిగించారు. దీపాల కాంతులో నందీశ్వరుడు ధగధగా మెరవడంతో భక్తులు తన్మయత్వం చెందారు.

– ఆమదాలవలస

కదలివచ్చిన సిరులతల్లి



సిరిమాను సంబరంలో భక్తజనం, (ఇన్‌సెట్లో) ఘటంతో యువతి

పూజారి రూపంలో సిరులతల్లి పైడితల్లి కదలివచ్చిన వేళ భక్తజనం పరవశించింది. తల్లి చల్లని కరుణాకటాక్షాల కోసం పరితపించింది. అరటిపళ్లను విసిరి ఆశీస్సులు అందుకుంది. సిరిమానోత్సవానికి తరలివచ్చిన అశేష భక్తజనంతో పైడితల్లి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. అమ్మవారికి ప్రతి రూపమైన పూజారి సిరిమానును అధిరోహించి భక్త జనావళికి ఆశీర్వచనాలు అందజేశారు. గంట ఆలస్యంగా సిరిమాను సంబరం ప్రారంభమైనా భక్తులు ఓపికగా నిరీక్షించారు.

-విజయనగరం టౌన్/విజయనగరం

క్లుప్తంగా

బుడ్డేపుపేటలో కార్డన్ సెర్చ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బుడ్డేపుపేటలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నాటుసారా, గుట్కా, గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి



పోలీసుల అదుపులో ఉన్న భీమారావు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో అధిక ధరలకు మద్యం అమ్ముతూ బెల్టు షాపులు నిర్వహిస్తున్నవారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ మంగళవారం హెచ్చరించారు. మండలంలోని పాయితారి గ్రామానికి చెందిన ఇందుగు భీమారావు తన ఇంట్లో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం రాత్రి తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దీనిలో భాగంగా మద్యం బాటిళ్లతో పాటు భీమారావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

కంచిలి: మండలంలోని సిర్తలి గ్రామంలో కొత్త చెరువు గట్టుపై సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దీనిలో భాగంగా ఏడుగురిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి రూ.41 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు మంగళవారం తెలియజేశారు.

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో పేకాట శిబిరంపై నరసన్నపేట పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో నిఘా వేసి దాడి చేశామని, 16 మందిని అరెస్టు చేసి.. రూ.4,800లు సీజ్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద మద్యం మత్తులో ఒక యువకుడు రోడ్డుపై వీరంగం సృష్టించాడు. ఫలితంగా జిల్లా న్యాయస్థానం మంగళవారం 45 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం నగరంలోని దమ్మలవీధికి చెందిన తమిరి సాయి మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వస్తూ, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అక్కడే ఉన్న ఎస్ఐ సోమశేఖర్ నిలువరించినా వినకుండా రోడ్డుపైనే వీరంగం చేశాడు. అప్పటికే సమాచారం అందుకున్న సీఐ నాగరాజు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపర్చగా.. శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ 45 రోజుల జైలు శిక్ష విధించారు. వెంటనే సాయిని అంపోలు జైలుకు ట్రాఫిక్ పోలీసులు తరలించారు.

కారిగూడ మినీ గురుకులంలో భోజనాల కోసం ఆరుబయట నిల్చున్న విద్యార్థినులు



పిల్లలకు ప్రత్యక్ష నరకం

- ఆరుబయట భోజనాలతో అవస్థలు
- వసతులు లేకపోవడంతో ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు:

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన వసతులు కల్పిస్తున్నామని కూటమి నాయకులు చెబుతున్న మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. కనీసం మధ్యాహ్న భోజనాలకు సంబంధించి భోజన శాలలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో సక్రమంగా తినలేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. జిల్లాలోని 30 మండలాల్లో 2,955 ప్రభుత్వ పాఠశాలలు, 38 ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,62,000 మంది, కాలేజీల్లో 12,500 మంది విద్యార్థులు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాలు చేస్తున్నారు. అయితే చాలా పాఠశాలల్లో భోజనశాలలు లేకపోవడంతో ఆరుబయట మైదానాల్లో, తరగతి గదుల్లో, పాఠశాల వరండాల్లో భోజనాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈవిధంగా భోజనాలు చేయడం వలన కుక్కలతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడితే భోజనం చేసేందుకు అగచాట్లు పడుతున్నారు. కొత్తూరుతో పాటు మండలంలోని మినీ గురుకుల పాఠశాలలో వడ్డించేందుకు గదులు లేకపోవడంతో ఆరుబయటే అన్నం వడ్డిస్తున్నారు. కొత్తూరులో చెట్టు నీడలో వడ్డన చేయడంతో పక్షుల రెట్టలు పడుతున్నాయి. కారిగూడ మినీ గురుకులంలో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో భోజనాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. మరికొన్ని పాఠశాలలు, కాలేజీల్లో స్థలం లేకపోవడంతో నిలబడి ప్లేట్లు పట్టుకొని భోజనం చేస్తున్నారు. దీంతో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.



కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మధ్యాహ్న భోజనాలు చేస్తున్న విద్యార్థులు

నరకం చూస్తున్నాం



భోజన శాలలు లేకపోవడంతో భోజనాలు చేసేందుకు ఇక్కట్లు పడుతున్నాము. చెట్టు నీడలో భోజనాలు వడ్డిస్తుండడం వలన పక్షులు రెట్టలు వేస్తున్నాయి. దీంతో భోజనాలు చేసేందుకు నరకం అనుభవిస్తున్నాము.

– చిగురుపిల్లి సంధ్య, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, కొత్తూరు

ప్రతిపాదనలు పంపించాం

పాఠశాలల్లో భోజనశాలలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న సమస్య మా దృష్టికి వచ్చింది. భోజన శాలల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. వీలైనంత వేగం సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం జిల్లా

వర్షం వస్తే ఇబ్బందులు



వంట శాలలు లేకపోవడంతో మైదానంలో భోజనాలు చేస్తున్నాము. వర్షాలు వచ్చినప్పుడు భోజనాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాము. భోజన సమయంలో కుక్కలు వస్తున్నాయి. చెట్టుకిందనే వడ్డన చేయడం వలన పక్షులు రెట్టలు వేస్తున్నాయి. వీటితో ఆందోళన చెందుతున్నాం. త్వరితగతిన భోజన శాల నిర్మించాలి.

– ఎల్.సాయికుమార్, తొమ్మిదో తరగతి, కొత్తూరు ఉన్నత పాఠశాల

● మర్యాదపూర్వక భేటీ



రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై భవిష్యత్ కార్యచరణ సమావేశాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటరీ పరిశీలకులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం పార్లమెంటరీ పార్టీ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణలు మర్యాదపూర్వకంగా కలిశారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

పార్టీ కోసం పనిచేసేవారికి ప్రాధాన్యం



ఎమ్మెల్సీ నర్తు రామారావును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: వైఎస్సార్‌సీపీలో పార్టీ కోసం పనిచేసేవారికి సరైన ప్రాధాన్యం లభిస్తుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని కొత్తపుట్టుగలో ఉన్న ఆయన నివాసంలో కవిటి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో మండల పార్టీ శ్రేణులు ఆయనను మంగళవారం సన్మానించారు. ఎమ్మెల్సీగా శ్రీకాకుళం జిల్లాతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించిన తీరును నాయకులంతా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. శాసన మండలి సమావేశాల్లో సమస్యలను ప్రస్తావించే అవకాశం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలనే దక్కిందని తెలియజేశారు. ఆయన ఆశయాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కుసుంపురం గ్రామానికి చెందిన బెంతు సామాజిక నాయకుడు శివ బిసాయి మాట్లాడుతూ.. వర్షాకాల సమావేశాల్లో తమ బెంతు ఒరియాల సమస్యలను ప్రస్తావించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిసారీ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కడియాల ప్రకాష్ మాట్లాడుతూ.. పరిపూర్ణమైన అవగాహనతోనే నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను ప్రస్తావించారని కొనియాడారు. పాండవ శేఖర్, పీఎం తిలక్, పూడి నేతాజీ, బెందాళం జయప్రకాశ్, గోపయ్య, మురళి, బర్ల నాగభూషణం, కృష్ణారావు, బాబురావు, వై.అశోక్, రవి, నారాయణ స్వామి, బర్ల నాగు, కాయ భీమసేన్, దువ్వు కృష్ణారెడ్డి, పాండవ శేఖర్, పిరియా కృష్ణారావు, చందాన పూర్ణచంద్రుడు, దుద్ది ధర్మారావు, పాతిన వెంకటరావు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడికి యత్నం దురదృష్టకరం



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం దురదృష్టకరమని దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారం మంగళవారం నిర్వహించారు. ఆయా సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, కంఠ వేణుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. సీజేఐపై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు బడే కామరాజు, ముంజేటి కృష్ణ, బాడాన దేవభూషణరావు, రౌతు శంకరరావు, ఎంఏ రఫీ, మహిబుల్లా ఖాన్‌లతో పాటు జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి పిట్ట దామోదరరావు, ఉపాధ్యక్షుడు సీతరాజు, ప్రతినిధులు బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు, చలపతిరావు, డి.రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండించారు. ఈ ఘటన న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలు ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, నాగరిక సమాజంలో దాడులకి స్థానం లేదన్నారు. కార్యక్రమంలో దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ నాయకులు వైశ్యరాజు మోహన్, నటుకుల మోహన్, యజ్జల గురుమూర్తి, అర్జి కోటి, పురుషో త్తం రాంబాబు, సంతు, అర్జి ఈశ్వరరావు, కొయిలా పు విజయ్, కొత్తూరు సత్యనారాయణ, పెయ్యల చంటి, అబ్బాస్, విజయ్, అఖిల్, రాము, మజ్జి గౌతమ్, రాహుల్, హేమంత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



అక్రమంగా తరలిస్తున్న పశువులు

హిరమండలం: పశువుల అక్రమ రవాణాను హిరమండలం పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం హిరమండలంలో ఎస్ఐ వెంకటేష్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తుండంతో పట్టుకున్నారు. కొత్తూరు మండలం బలద సంతలో కొని అలమండ తరలిస్తుండగా పట్టుకున్నారు. దీంతో కొత్తవలసకు చెందిన జనార్దనరావు, గణపతిరావులపై కేసు నమోదు చేశారు. బొలేరో వాహనాన్ని సీజ్ చేశామని, ఎనిమిది పశువులను గుర్ల గోశాలకు తరలించామని ఎస్ఐ వెల్లడించారు.

ఎరువుల పంపిణీకి సాంకేతిక లోపమే కారణం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కళ్లేపల్లి గ్రామంలో ఎరువుల పంపిణీపై 'ఎరువుల కోసం టీడీపీ నేత ఇంటి వద్ద క్యూ' శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ ఒక ప్రకటనలో స్పందించారు. కళ్లేపల్లి గ్రామంలోని 196 మంది రైతులకు డీసీఎంఎస్ ద్వారా 333 యూరియా బస్తాలు వచ్చిన విషయం వాస్తవమేనన్నారు. వాటిని రైతుసేవ కేంద్రం ద్వారా ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, అక్కడ వైఫై పని చేయకపోవడంతో ఎదురుగా ఉన్న గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంటి నుంచి వైఫై కనెక్షన్ తీసుకొని తర్వాత రైతుసేవ కేంద్రం నుంచే ఎరువులు పంపిణీ చేశామన్నారు. సాంకేతిక కారణం వలనే ఇలా చేసినట్లు తెలియజేశారు.

ఇరువర్గాల కొట్లాట

● రిమాండ్‌కు ఆరుగురు తరలింపు

రణస్థలం: మండలంలోని నారువ పంచాయతీ గొల్ల మెంటాడ గ్రామంలో భూ వివాదం వలన జరిగిన కొట్లాటలో రెండు వర్గాలకు చెందిన ఆరుగురుని జేఆర్‌పురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దుక్క సూరి, దుక్క సన్యాసికి మధ్య ఏడాది కాలంగా భూ వివాదం నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో పలుమార్లు వీరిపై కేసులు నమోదు చేయడం జరిగింది. మరలా సోమవారం ఇరువర్గీయులు కొట్లాటకు దిగడంతో దుక్క సూరి వర్గీయులు నలుగురుని, దుక్క సన్యాసి వర్గీయులు ఇద్దరిని మొత్తం ఆరుగుని జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

- అధికంగా పండిస్తున్న సవరజాడుపల్లి గిరిజనులు
- సేంద్రియ పంటలు విక్రయిస్తూ జీవనం
- ఆసక్తి చూపిస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు

పోడు పంట.. ఆరోగ్యకరమంట..!

మెళియాపుట్టి:

ప్రస్తుతం మనం తీసుకునే ఆహార పదార్థాల్లో అత్యధిక శాతం రసాయనిక ఎరువులు వినియోగించి పండించినవే. మార్కెట్‌లో రసాయనిక ఎరువులు లేకుండా పండిన కూరగాయలు, పండ్లు దొరకడం ఈరోజుల్లో గగనమైపోయింది. అయితే ఇటువంటి తరుణంలో మండలంలోని సవర జాడుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు పోడు భూముల్లో సేంద్రియ పద్ధతిలో పంటలు, పండ్లను పండిస్తూ ఆరోగ్యానికి భరోసానిస్తున్నారు. వారికి ఉన్నటువంటి పోడు భూముల్లో నిత్యం పనులు చేసుకుంటూ ఆరోగ్యకరమైన పంటలకు ప్రాధాన్యమిస్తూ జీవన భృతిని కొనసాగిస్తున్నారు. సీతాఫలం, జామ, అరటి, పనస, అనాస, బొప్పాయి, మామిడి, జీడి వంటి పంటలను పండిస్తూ గ్రామ సమీపంలోని రహదారి వద్ద విక్రయిస్తుంటారు. సహజ సిద్ధంగా పండిస్తున్న పంటలు కావడంతో రాహదారిలో రాకపోకలు సాగించేవారు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. అయితే ప్రభుత్వ సహకారం అందిస్తే మరిన్ని రకాలైన కమలా, బత్తాయి, దానిమ్మ, నిమ్మ లాంటి తోటలు పెంపకానికి అవకాశం ఉంటుందని అక్కడి గిరిజనులు చెబుతున్నారు.



సవర జాడుపల్లి గ్రామం వద్ద పండ్లను విక్రయిస్తున్న గిరిజన మహిళలు

ప్రతిరోజూ విక్రయిస్తాం



మా గ్రామంలో సుమారుగా అన్ని కుటుంబాలు అడవిపై ఆధారపడి జీవనం పొందుతున్నాము. మా పోడు భూముల్లో ఎటువంటి ఎరువులు లేకుండా పండించి అమ్ముతాము. నాకున్న కొద్దిపాటి పోడుభూమిలో బొప్పాయి, పనస, అరటి తోటలు వేసుకున్నాను.

– సవర శాంతమ్మ, సవర జాడుపల్లి

ప్రభుత్వం సహకరించాలి



పోడు భూములు మాకు దైవంతో సమానం. వాటిలోనే పంటలు పండించుకుని అమ్ముతాము. మా గ్రామానికి చాలామంది వచ్చి పంటలు కొనుగోలు చేస్తుంటారు. కొన్ని తీసుకుని వెళ్లి రహదారి పక్కన అమ్ముతాము. మేము ధరలు అధికంగా చెప్పము. ఏదో ఒక ధరకి విక్రయించడమే మాకు తెలుసు. అధికారులు, ప్రభుత్వం సహకారం అందిస్తే మరింతగా పంటలు పండిస్తాం.

– సవర సరస్వతి, సవర జాడుపల్లి

క్రైమ్ కార్నర్

యువకుడు అనుమానాస్పద మృతి



ఉరికి వేలాడుతున్న మృతదేహం

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగలో ఈనెల 1వ తేదీన జరిగిన అనుమానాస్పద మృతి కేసు వివరాలను కవిటి పోలీసులు మంగళవారం ఆలస్యంగా మీడియాకు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొనియా సురేష్ ప్రధాన్(25) ఈనెల 1వ తేదీన తన జీడితోటలో జీడిచెట్టుకు టవల్‌తో ఉరివేసుకుని వేలాడుతుండడంతో అతని అక్క కె.పద్మ చూసింది. వెంటనే గ్రామస్తులు కవిటి పోలీసులకు తెలిపారు. దీంతో 2వ తేదీ ఉదయం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే అనుమానాస్పద మృతిగా నమోదు చేసి, విచారణ చేపడుతున్నట్టు కవిటి ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ విషయం ఎందుకు ఇన్ని రోజులు మీడియాకు వెల్లడించలేదని ప్రశ్నించగా.. తాను బందోబస్తు డ్యూటీకి వెళ్లిపోయినందువల్ల ఆలస్యం జరిగిందన్నారు. కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం



సవర విజయ్ మృతదేహం

మందస: లగేజీ ఆటో ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మందస మండలంలో చోటుచేసుకుంది. తంగరపుట్టి గ్రామానికి చెందిన సవర విజయ్(25) సోమవారం మందస వచ్చి తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా రాయికోల గ్రామం వద్ద లగేజీ ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలుపాలైన యువకుడిని వైద్యం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మరణించారు. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డితాండ్ర రైల్వే గేటు సమీపంలో ట్రాక్‌పై పడి ఒక గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందారు. వ్యక్తిపై నుంచి ట్రైన్ వెళ్లడంతో శరీరభాగాలు ముక్కలుగా పడి ఉన్నాయి. దీనిని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రైల్వే ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి



మృతుడు అంబటి యర్రయ్య

రణస్థలం: మండలంలోని జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన అంబటి యర్రయ్య (47) పడవ బోల్తాపడి మృతి చెందారు. జేఆర్‌పురం పోలీసులు, స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల మేరకు.. అంబటి యర్రయ్యతో పాటు మరో ముగ్గురు వాసుపల్లి పోతయ్య, దుమ్ము అప్పన్న, సూరాడ లక్ష్మణలు సముద్రంలో మంగళవారం ఉదయం వేటకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు ఒడ్డుకు వస్తున్న సమయంలో భారీ కెరటాలకు పడవ బోల్తా పడి నలుగురూ సముద్రంలో పడిపోయారు. వారిలో దురదృష్టవశాత్తు అంబటి యర్రయ్య సముద్రంలో మునిగిపోయి చనిపోయాడు. మిగతా ముగ్గురు ఒడ్డుకు క్షేమంగా చేరుకున్నారు. మృతుడికి భార్య యర్రమ్మ, ఇద్దరు కుమారుడు, కూతురు ఉన్నారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. భగవంతుడే వాల్మీకి మహర్షిగా జన్మించి పురాణాలు రచించారని, అవి విశ్వమానవ సౌభ్రాతృత్వంను చాటుతాయని నమ్ముతారని వివరించారు. పురాణాలంటే భారతీయులకు అత్యంత విశ్వాసమని పేర్కొన్నారు. రామాయణంపై సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు ప్రగడ వెంకన్న, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జీఏ సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, సెట్విస్ సీఈవో అప్పలనాయుడు, పీజీఆర్ఎస్ సూపరింటెండెంట్ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు